సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 14 । డిసెంబర్ । 2024



వృద్ధులపై యువకుడి దాడి

పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న వృద్ధులపై.. ఓ యువకుడు దాడి చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అతను మద్యం మత్తులో గ్రామంలో వీరంగం సృష్టించాడు. - 8లో



ఆధ్యాత్మిక నిలయం..జ్యోతిక్షేత్రం

జ్యోతిక్షేత్రం ఆధ్యాత్మిక నిలయంగా భాసిల్లుతుంది. ఈ క్షేత్రంలో శ్రీఅవధూత కాశినాయన ఆరాధన మహోత్సవాలు ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్నాయి. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.8

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 22.8 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.41 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

దగాపై దండయాత్ర



జేసీ అదితి సింగ్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నేతలు



కడప కలెక్టరేట్ వద్దకు భారీ ర్యాలీగా తరలివస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు

అన్నదాతకు అండగా...

కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన రైతులు
- వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ
- ఎన్నికల హామీలు విస్మరించడంపై కూటమి ప్రభుత్వంపై మండిపాటు
- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం సమర్పణ

కడప సెవెన్‌రోడ్స్/కార్పొరేషన్ : అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తి చేసుకున్నప్పటికీ రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి తన ఎన్నికల హామీలను విస్మరించి, ప్రజలను వంచించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం కడపలో ఆ పార్టీ ఆధ్వర్యంలో «అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ» పేరుతో ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, మేధావులు వేల సంఖ్యలో ఉదయాన్నే జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె, మహావీర్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అప్పటికే పోలీసులు కలెక్టరేట్ వద్ద పెద్ద సంఖ్యలో మోహరించారు. కార్యాలయ ప్రధాన ద్వారాలను మూసివేశారు. ముఖ్య నాయకులను మాత్రమే లోనికి వెళ్లేందుకు అనుమతిస్తామని చెప్పారు. దీంతో పార్టీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఒక దశలో పోలీసు వలయాన్ని ఛేదించుకొని కార్యకర్తలు లోనికి ప్రవేశించారు. ముఖ్య నాయకులు సర్ది చెప్పడంతో శాంతించారు. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్‌డీఏ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని కార్యకర్తలు చేసిన నినాదాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. రిమ్స్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోయింది.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి..

ర్యాలీ అనంతరం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా కూడా తమకు ఇవ్వడం లేదని తెలిపారు. ఇందుకు జేసీ స్పందిస్తూ ఈనెల 11వ తేదీనే జాబితా ప్రచురించామని తెలిపారు. వీఆర్‌ఓలు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని, వారి దౌర్జన్యాలకు కళ్లెం వేసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. రాజోలి రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న గ్రామాల రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డా. సుధీర్ రెడ్డి కోరారు. రైతులు వారి భూములను అమ్ముకోవడానికి కూడా అవకాశం లేకుండా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ కె. సురేష్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యేష్టాది శారద, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, జెడ్పీ వైస్ చైర్మెన్ బాలయ్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డీసీసీ బ్యాంక్ మాజీ చైర్మెన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మెన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామగోవింద రెడ్డి, పులి సునీల్, యానాదయ్య, పాకా సురేష్, జయచంద్రారెడ్డి, చిన్నప్ప, సీహెచ్ వినోద్ కుమార్, హఫీజుల్లా, వేణుగోపాల్ నాయక్, డా. సొహైల్, డా. శివానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే గిట్టని సర్కార్



కూటమి ప్రభుత్వానికి రైతుల సమస్యలంటే పట్టడం లేదని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా విమర్శించారు. ఆరునెలల కాలంలో ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించి ఆదుకుంటామని చెప్పిన చంద్రబాబు, బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయించారని దుయ్యబట్టారు.

ప్రభుత్వానికి బాధ్యత లేదా..



తుఫానుల వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో పరిహారం అందించేవారమన్నారు. ఒక్క మైదుకూరు నియోజకవర్గంలోనే రూ.150 కోట్ల ఇన్సూరెన్స్ ఇప్పించామని తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

రైతులను దగా చేసిన సర్కార్



రైతులను కూటమి ప్రభుత్వం దగా చేసిందని వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జరిగిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. దళారీ వ్యవస్థను తొలగించాలన్నారు.

భయంతోనే దాడులు



ఆరునెలల పాలనలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ సమయంలో సాగునీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా జరిగితే ఓడిపోతామన్న భయంతోనే అధికార పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆరోపించారు. పెద్దముడియం మండల తహసీల్దార్ కార్యాలయానికి వీఆర్‌ఓలందరినీ పిలిపించి టీడీపీ నాయకులు వారందరినీ తమ ఇళ్లకు బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. వేములలో తమపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే ఎదురు కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు.

రైతు సమస్యలు పట్టవా..



రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం లేదని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. వ్యవసాయం దండగ, ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై దుస్తులు ఆరేసుకోవాల్సి ఉంటుందని చెప్పిన ఘనత చంద్రబాబుదేనన్నారు. విద్యుత్ సమస్యలపై అప్పట్లో రైతులు హైదరాబాద్‌లో ఆందోళన నిర్వహించగా, బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపి పలువురిని పొట్టన బెట్టుకున్నారని పేర్కొన్నారు.

ప్రజలను వంచించిన కూటమి నేతలు



ఎన్నికల సందర్భంగా కూటమి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసగించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సంవత్సరం దాటాక ప్రజా సమస్యలపై గళం విప్పాలని తొలుత భావించామని, అయితే ఆరు నెలలు తిరక్కుండానే పెద్ద సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వస్తున్నారంటే రాష్ట్రంలో పరిపాలన ఎంత దరిద్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. కూటమి తన ఆరు నెలల పాలనలో ప్రజలకు ఏమీ చేయకపోయినా రూ.72వేల కోట్ల అప్పులు తీసుకొచ్చి ఆ భారాన్ని మోపిందని దుయ్యబట్టారు. రైతులకు పెట్టుబడి నిధి కింద రూ.20వేలు సాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయమన్నారు. కరువు మండలాలు ప్రకటించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యత నుంచి తప్పుకుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రభుత్వం మోసగించిందని ఆరోపించారు. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, ఒక దానితోనే సరిపెట్టారని విమర్శించారు. జిల్లాలోని సాగునీటి సంఘాలకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించడం లేదని ఆరోపించారు. టీడీపీ నేతలు పాల్పడుతున్న అవకతవకలు, దౌర్జన్యాలను ప్రజలకు చూపేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడం అప్రజాసామ్యమని దుయ్యబట్టారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు పార్లమెంటు సభ్యున్ని అరెస్ట్ చేయడం దారుణమన్నారు.

న్యూస్‌రీల్

16న జిల్లాస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఈనెల 16వ తేదీన జిల్లాస్థాయి కబడ్డీ జూనియర్ విభాగం బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య తెలిపారు. 2005 జనవరి 12 తర్వాత పుట్టిన క్రీడాకారులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే అంతర్ జిల్లాల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9133480661, 9949304160 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం



పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో శుక్రవారం స్థానిక ఆ కార్యాలయంలో నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 9 మంది జూనియర్ అసిస్టెంట్స్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా, ఒకరికి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకట సుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ రవికుమార్, చంద్ర, వనీష తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

– జిల్లా వ్యాప్తంగా 20 బెంచీలు ఏర్పాటు

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో శనివారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు «జాతీయ లోక్ అదాలత్» ను నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టులలో 20 బెంచీలను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అడుగడుగునా అధికార దర్పం

కూటమి నేతలు అడుగడుగునా అధికార దర్పం ప్రదర్శించారు. సాగు నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో ఏకంగా వీఆర్వోలను ప్రైవేటు వాహనంలో తరలించుకుపోయారంటే వారి ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. తహసీల్దార్ కార్యాలయాల వద్దకు కూటమి నాయకులు భారీగా చేరుకుని వైఎస్‌ఆర్‌సీపీ తరఫున బరిలో నిలిచేవారిని అడ్డుకుంటున్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులు, పోలీసులపై ఉన్నా వారు అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారు. ప్రభుత్వ నియంతృత్వ పోకడలను పలువురు తీవ్రంగా తప్పబడుతున్నారు.

• కూటమి కుయుక్తులు

– నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వీఆర్వోలను తీసుకుపోయిన కూటమి నేతలు

జమ్మలమడుగు : నీటి సంఘాల ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నామంటూనే అధికార ఎన్‌డీఏ కూటమికి వత్తాసుపలికే విధంగా చర్యలను చేపడుతున్నారు. శనివారం నీటి సంఘాల ఎన్నికలు ఉండటంతో పోటీ చేసే అభ్యర్థులు ఆయకట్టు, చెరువు కింద సాగు చేస్తున్న పొలం రైతులు నీటి పన్ను కట్టి నోడ్యూస్ సర్టిఫికెట్ పొందాలని అధికారులు సూచించారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులు గ్రామాలలో ఆయకట్టు కింద రైతులందరూ కలిసి వీఆర్వోలకు డబ్బులు చెల్లించారు. ఆ తర్వాత ఇవ్వవలసిన నోడ్యూస్ సర్టిఫికెట్‌లను మంజూరు చేయడంలో వీఆర్వోలు కనిపించకుండా పోతున్నారు. గట్టిగా నిలదీస్తే సచివాలయంలో కాకుండా పెద్దముడియం తహసీల్దార్ కార్యాలయంలో ధృవీకరణ పత్రాలు ఇస్తారని రైతులకు వివరించారు. దీంతో రైతులు ఉదయమే పెద్దముడియంకు వెళ్లారు. అప్పటికే అక్కడికి వివిధ గ్రామాలనుంచి టీడీపీ నాయకులతో పాటు బీజేపీ నాయకులు చేరుకున్నారు. రెవెన్యూ అధికారితో మాట్లాడటంతో తహసీల్దార్ కార్యాలయం నుండి బయటికి వెళ్లిపోయారు. ఇదే అదనుగా 8 మంది వీఆర్వోలను అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రత్యేక బొలెరో వాహనంలో ఎక్కించుకునిపోయారు. నోడ్యూస్ సర్టిఫికెట్లు కోసం వచ్చిన రైతులు అధికారులు కనిపించడంలేదు. ఫోన్ చేసినా ఫోన్లు స్విచాఫ్‌లో ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పక్షం నాయకులు రైతు సంఘం ఎన్నికల్లో తమని పోటీ చేయకుండా ఇలా చేస్తున్నారంటూ మండిపడ్డారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

నియంతపాలనను తలపిస్తోంది

జమ్మలమడుగులో నియంత పాలన కొనసాగుతుంది. కూటమికి చెందిన కొందరు నాయకులు వీఆర్వోలను బెదిరించి ప్రైవేట్ వాహనంలో తీసుకుపోవడం చూస్తే.. వారి పాలనా తీరు ఎలా ఉందో అర్థం అవుతుందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కూటమి నేతల తీరుకు నిరసనగా శుక్రవారం రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పెద్దముడియం మండల వీఆర్వోలను దేవగుడి యూత్ నాయకుడు నాగేష్ నరసింహారెడ్డి మరికొందరు నాయకులు ప్రైవేట్ వాహనంలో తీసుకునిపోయారని.. వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. అధికారులు వెంటనే నోడ్యూస్ సర్టిఫికెట్‌లను ఇప్పించాలని లేదా ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మైలవరం నాయకులు మహేశ్వరరెడ్డి, శివగుర్విరెడ్డి, మోహన్‌రెడ్డి, రామాంజనేయుల యాదవ్, పెద్దముడియం నాయకులు గిరిధర్‌రెడ్డి, జమ్మలమడుగు పట్టణ నాయకులు ముల్లాజానీ, మార్బల్ శ్రీను,హృషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• టీడీపీ నేతల దౌర్జన్యం

– వీఆర్వో చొక్కా పట్టుకుని బెదిరింపులు

వేంపల్లె : నీటి సంఘం ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నో డ్యూస్ సర్టిఫికెట్లు తీసుకునేందుకు వస్తుండగా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఎవరికీ కూడా నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకూడదని టీడీపీ నాయకులు బెదిరించడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు. నీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులకు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇచ్చేసిన అనంతరం వీఆర్వోల దగ్గర నుంచి రబ్బర్ సీళ్లను బలవంతంగా లాక్కున్నారు. ఎవరైనా సరే వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులకు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇస్తే మీ అంతు చూస్తామని బెదిరించారు. గురువారం ముత్తుకూరు గ్రామంలో వీఆర్వో లూకా 8 మందికి నీటి పన్ను రసీదులు ఇచ్చాడని టీడీపీ నాయకులు ఆయన చొక్కా పట్టుకొని నీకు ఎంత ధైర్యం ఉంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నీటి పన్ను రసీదులు ఇస్తావని బెదిరించారు. ఒకవేళ సర్టిఫికెట్ ఇస్తే పాదరక్షతో కొట్టేందుకు కూడా వెనుకాడమని బెదిరించారు. టీడీపీ నేతలు చేస్తున్న అరాచకాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తరఫున నీటి సంఘం ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వేంపల్లి జెడ్పీటీసీ రవి కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు.

• ఎన్నికల్లో గెలవలేమనే..



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, నేతలు


చక్రాయపేట : ఎన్నికల్లో గెలవలేమనే భయంతో టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని చక్రాయపేట మండల వైఎస్‌ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు. శుక్రవారం నీటిపన్ను చెల్లించేందుకు తహశీల్దారు కార్యాలయం వద్దకు వైఎస్‌ఆర్‌సీపీ నేతలు వస్తారని భావించిన టీడీపీ నేతలు ముందుగానే వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. మా ప్రభుత్వం మా ఇష్టం.. అనే రీతిలో వారు వ్యవహరించడంతో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో కక్షలు పెట్టడానికే ప్రభు త్వం నీటి సంఘాల ఎన్నికలను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

• ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరగాలి

– వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్ రెడ్డి

వేంపల్లె : నీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి వెంకట సతీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నీటి సంఘం ఎన్నికల నేపథ్యంలో వేంపల్లి సీఐ సురేష్ రెడ్డి ఆయనను హౌస్ అరెస్ట్ చేసి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే నీటి పన్ను కట్టాలని ప్రభుత్వం నిబంధనలు పెట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ వేసే వారికి రెవెన్యూ అధికారులు ఎవరు కూడా సహకరించకుండా టీడీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని అరెస్టు చేయగా, తమను అక్రమంగా హౌస్ అరెస్ట్ చేశారన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘం ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ వేసే అభ్యర్థులకు, ప్రతిపాదించే అభ్యర్థులకు నో డ్యూస్ సర్టిఫికెట్ తెచ్చుకునే అవకాశం లేకుండా టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు.

– పులివెందుల మండలంలోని అచ్చివెల్లి, ఎర్రంరెడ్డిపల్లెకు సంబంధించిన విషయంలోనూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు కూటమి నేతలు వచ్చి నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకున్నారు. సింహాద్రిపురం, తొండూరులలో కూడా ఇదే పరిస్థితి.



వేంపల్లెలో మాట్లాడుతున్న సతీష్ కుమార్ రెడ్డి

పాత్రికేయులపై
దాడులను అరికట్టాలి



సాక్షి పాత్రికేయులపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబును కలిసి వినతిపత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు, పాత్రికేయులు



వేములలో జర్నలిస్టులపై జరిగిన దాడిని నిరసిస్తూ పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న విలేకరులు

కడప రూరల్ / కడప అర్బన్ : వేముల మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం విధి నిర్వహణలో ఉన్న సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, రిపోర్టర్ రాజారెడ్డిపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా జర్నలిస్ట్ సంఘాలు..నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పాత్రికేయులపై దాడి చేసేవారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

అంతటా ఆందోళన...

కడపలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పులివెందులలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్యాలీగా ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. యర్రగుంట్లలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రొద్దుటూరులో ఏపీయూడబ్ల్యూజే, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. వేములలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రఘునాథరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జమ్మలమడుగు, బద్వేల్‌లో పాత్రికేయులు ఆందోళనకు దిగారు. దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన దాడులపై నిరసనలు తెలిపారు.

దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలి

వేముల మండలంలో నీటి సంఘాల ఎన్నికల కవరేజికి వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, వేముల మండలం సాక్షి విలేకరి రాజారెడ్డిలపై టీడీపీ నేత పేర్ల శేషారెడ్డి, మరికొంత మందితో కలిసి రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే నేతలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం కడపలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) కె. ప్రకాష్‌బాబును కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నేతలు మాట్లాడుతూ కవరేజికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడి చేయడం దారుణమన్నారు. కవరేజ్‌లో వున్న రిపోర్టర్‌లపై దాడి చేయడం, కెమెరా 4జి లైవ్ కిట్‌లను ధ్వంసం చేయడంపై అదనపు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విధంగా దాడులు చేయడం పత్రికల, మీడియా స్వేచ్ఛను హరించినట్లేనన్నారు. ప్రజాశ్రేయస్సు కోసం పోరాడే పత్రిక, మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడితే ప్రజాస్వామ్యానికి మనుగడ ఎలా ఉంటుందన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. సంఘటన స్థలంలో తమపై దాడి జరిగిన విషయాన్ని సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు అదనపు ఎస్పీకి వివరించారు. తమపై టీడీపీ నేత పేర్ల శేషారెడ్డి, మరో 50 మందిదాకా వచ్చి రాళ్లతో దాడి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షుడు భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శివరాం, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా నాయకులు సత్తార్, కిషోర్, నితిన్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, యూసఫ్, మహబూబ్‌బాషా, జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైవీయూ క్రీడా పోటీలు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో అంతర కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు వైవీయూ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్‌ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 20న యోగ, 24న ఖోఖో పోటీలు స్త్రీ, పురుషులకు ఉంటాయన్నారు. ఎంపికల్లో పాల్గొనదలచిన విద్యార్థులు 2024 జూలై 1వ తేదీ నాటికి 17– 25 ఏళ్ల మధ్య వయసు కలిగి, విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీ, పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ మార్క్స్‌ మెమోలు ఒరిజినల్‌, జిరాక్స్‌ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్లు :9705459052, 7997047676కు సంప్రదించాలని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

అట్లూరు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అట్లూరు అటవీ చెక్‌పోస్టు దగ్గర కడప–బద్వేలు ప్రధాన రహదారిపై శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సిద్దవటం మండలం పెన్నానది నుంచి ఇసుకను తీసుకుని వస్తున్న నాలుగు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి అట్లూరు తహసీల్దారుకు అప్పగించారు. వాహనాల యజమానులు తహసీల్దారు దగ్గర జరిమానా చెల్లించి ట్రాక్టర్లను తీసుకెళ్లారు.

15న జిల్లా ఆర్చరీ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలోని డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ క్రీడా పాఠశాలలో ఈ నెల 15న జిల్లా స్థాయి సబ్‌జూనియర్‌ ఆర్చరీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్‌ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రికర్వ్‌రౌండ్‌, కాంపౌండ్‌ రౌండ్‌, ఇండియన్‌ రౌండ్‌ విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్‌, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆర్చరీ అసోసియేషన్‌ పోర్టల్‌లో రిజిస్టర్‌ కానివారు గూగుల్‌ ఫారం పూరించి ఈనెల 15న రిజిస్టర్‌ చేసుకోవాలని వివరించారు.

నేడు తరగతులు నిర్వహించవద్దు

వైవీయూ : జిల్లాలోని అన్ని జూనియర్‌ కళాశాలలకు రెండవ శనివారం సెలవుదినంగా ప్రకటించినట్లు ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు నిబంధనలు పాటించకుండా.. తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అంకాలమ్మ ఆలయంలో చోరీ

ఓబులవారిపల్లె : మండల పరిధి చెలంపాలెం గ్రామంలోని అంకాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. రోజూ లాగే శుక్రవారం ఉదయం గుడి తెరిచి చూడగా హుండీ పగులగొట్టిన దృశ్యాన్ని చూసి గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు లక్ష రూపాయలు చోరీకి గురైందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక నిలయం.. జ్యోతి క్షేత్రం

- మహిమాన్వితుడు కాశినాయన
- నేటి నుంచి ఆరాధన మహోత్సవాలు
- భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు



కాశినాయన సమాధి



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షామియానాలు



వంటలకు కూరగాయలు తరుగుతున్న భక్తులు

కాశినాయన : జ్యోతిక్షేత్రం ఆధ్యాత్మిక నిలయంగా భాసిల్లుతోంది. ఇక్కడ కొలువైన శ్రీఅవధూత కాశినాయనస్వామి మహిమాన్వితుడిగా ప్రసిద్ధి చెందారు. కాశినాయన 29వ ఆరాధన మహోత్సవాలు శనివారం, ఆదివారం ఘనంగా జరగనున్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం బెడుసుపల్లె గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన కాశినాయన చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతనకు అలవాటుపడ్డారు. ఆయన గురువు యతిరాజు గురవయ్య వద్ద ఆత్మజ్ఞానం పొందారు. అక్కడి నుంచి వైఎస్‌ఆర్‌ జిల్లా బద్వేలు నియోజకవర్గంలోకి ప్రవేశించి వరికుంట్ల, నాయునిపల్లె, గంగనపల్లె గ్రామాలకు చేరుకున్నారు. అక్కడ కొన్నేళ్ల పాటు చిన్నపిల్లలకు విద్యాబోధన చేస్తూ ఆధ్యాత్మిక చింతన కొనసాగించారు. ఆ సమయంలో వరికుంట్ల సమీపంలోని నల్లమల అడవుల్లోని జ్యోతిక్షేత్రంలో జ్యోతి నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. జ్యోతి నరసింహస్వామికి పూజలు చేస్తుండేవారు. సమీపంలోని గరుడాద్రి కొండ మీద కఠోరదీక్షతో తపస్సు చేశారు. అనంతరం అన్నదాన ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ వచ్చేవారు.

ఆలయాల పునరుద్ధరణకు కృషి

అవధూతగా మారిన కాశినాయన శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. చుక్కనీరు దొరకని గరుడాద్రి కొండమీద నీటిబావులు తవ్వించారు. గరుడాద్రి, అనంతరాయుడు, జ్యోతి, సిద్దేశ్వరం, లింగమయ్యకొండ, యోగానందలోని ఆలయాలను పునరుద్ధరించారు. కర్నూలు జిల్లా నల్లమల అడవుల్లో ఉన్న అహోబిలం వద్ద యోగానంద ఆశ్రమం స్థాపించి.. పశు సంపద, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నరసింహస్వామి పాదాల చెంత సమాధి

వందేళ్లు జీవించిన కాశినాయన తన ఇష్టదైవమైన జ్యోతి నరసింహస్వామి పాదాల చెంత 1995 డిసెంబర్‌ 5న సమాధి అయ్యారు. ఆయన సమాధి చెందిన ప్రాంతంలో ఒక పురాతన మర్రిచెట్టు తనంతట తానే నేలవాలింది. ఆయన సేవిస్తూ వచ్చిన గోమాత కాశినాయన మరణాన్ని జీర్ణించుకోలేక మూడవ రోజున తనువు చాలించింది.

దేవాలయం ఏర్పాటు

కాశినాయన సమాధిపై అద్భుతమైన దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. 60 తెలుగు సంవత్సరాలకు ప్రతీకగా 60 రాతి స్తంభాలతో 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా దేవాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆవు సమాధిని కూడా అందంగా నిర్మించారు. వంటశాలలు, భోజనశాలలు, వసతిగృహాల నిర్మాణాలతో జ్యోతిక్షేత్రం కళకళలాడుతోంది.

నిత్యాన్నదానం

కాశినాయన ఆశ్రమాన్ని దర్శించే భక్తులకు స్వామి దర్శనం ఎంత ఇష్టమో.. అక్కడ భోజనం చేసి రావడం అంత పవిత్రం. రోజూ వందల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని భోజనం చేస్తుంటారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో భక్త జనం భారీగా వస్తుంటారు. ఏడాది పొడవునా అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుంది. రైతులు తాము పండించిన పంటలో కాశినాయన పేరున తీసి ఉంచిన ధాన్యం, కూరగాయలు, పప్పుధాన్యాలు ఆశ్రమానికి తమకు తాముగా చేరవేస్తుంటారు. దీంతో అన్నదానం సజావుగా సాగుతోంది.

నేడు జ్యోతి ప్రజ్వలన

రెండు రోజుల పాటు జరిగే కాశినాయన ఆరాధన మహోత్సవాలకు ఉమ్మడి వైఎస్‌ఆర్‌ జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మైదుకూరు ఆర్టీసీ డిపో వారు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కాశినాయన మాలను ధరించి కొంత మంది భక్తులు దీక్షలో కొనసాగుతున్నారు. వీరంతా ఈ నెల 14వ తేదీ రాత్రికి జ్యోతిక్షేత్రానికి చేరుకుని జ్యోతి ప్రజ్వలనలో పాల్గొంటారు. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కాశినాయన ఎస్‌ఐ హనుమంతు, పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డిలు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

గాయపడిన బాలుడి మృతి

రాయచోటి : బండరాయి విరిగిపడి గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిపోగు సన్నీ (12) శుక్రవారం మృతి చెందాడు. రాయచోటి మండలం దిగువ అబ్బవరం పాత దళితవాడకు చెందిన బాలిపోగు నరేష్‌ కుమారుడు సన్నీ నవంబర్‌ 29న తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ సందర్భంలో బండరాయిని పట్టుకొని ఊగుతుండగా.. ఆ రాయి విరిగి మీదపడటంతో గాయపడ్డాడు. వెంటనే తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ జహీర్‌ తెలిపారు.

కోడిపందెం ఆటగాళ్ల అరెస్ట్‌

రాయచోటి : రాయచోటి మండలం మాధవరం మద్దెలకుంట సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. పందెం ఆడుతున్న ఎనిమిది మందితోపాటు ఆరు కోళ్లు, 21 బైకులు, రూ.14500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, శనివారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్పీ, స్పెషల్‌ పార్టీ పోలీసులు మెరుపుదాడి చేసినట్లు సమాచారం.

పోలీసుల అదుపులో జూదరులు

మదనపల్లె : పట్టణంలోని రామిరెడ్డి లేఅవుట్‌లో శుక్రవారం జూద స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుంచి రూ.25,750 స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్‌ సీఐ ఎరీషావలీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సమాజ పురోగతిలో మానవీయ విలువలు ముఖ్యం

అంతర్జాతీయ సదస్సులో వక్తలు



సావనీర్‌ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వైవీయూ : సమాజం అన్ని రంగాల్లో రాణించాలన్నా.. జ్ఞానసమాజాన్ని నిర్మించాలన్నా మానవీయ విలువలు ఎంతో ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా శుక్రవారం 'ఎంపవరింగ్‌ యూత్‌ : రోల్‌ఆఫ్‌ హ్యూమన్‌ వాల్యూస్‌ అండ్‌ ప్రొఫెషనల్‌ ఎథిక్స్‌ ఫర్‌ ఔటర్‌ టుమారో' అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల విద్య ఆర్‌జేడీ డాక్టర్‌ ఆర్‌. డేవిడ్‌కుమార్‌స్వామి, వైవీయూ రిజిస్ట్రార్‌ ఆచార్య పుత్తా పద్మ, బ్రహ్మంగారిమఠం ఆధ్యాత్మిక గురువు స్వామి విరజానంద విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వృత్తిపరమైన విలువలు అందిస్తాయన్నారు. ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ విద్యార్థులు గురువులు చూపిన బాటలో నడుస్తూ ఉన్నత ఆశయాలకు పునాదులు వేసుకోవాలని సూచించారు. స్వామి విరజానంద మాట్లాడుతూ మహిళ గొప్పతనం, భారతదేశ స్త్రీ ఔన్నత్యం గురించి వివరించారు. అమెరికాలోని మిస్సిస్‌ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్‌ రాజమోహన్‌ కల్లూరు, ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ సీనియర్‌ అడ్వైజరీ కన్సల్టెంట్‌ డాక్టర్‌ మురళీధర్‌ పంచాంగుల, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు సత్తార్‌సాహెబ్‌, వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి, ఎన్‌.ఈశ్వరరెడ్డి, ఎం.ఎం.వినోదిని, ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జి.రవీంద్రనాథ్‌ మాట్లాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌ ఎస్‌.సలీంబాషా మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సుకు 200 పరిశోధక పత్రాలు రావడం గొప్పవిషయమన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా సావనీర్‌ విడుదల చేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్‌ సుజాత, కార్యదర్శి కృష్ణవేణి, కోఆర్డినేటర్‌ గురుమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుకేష్‌ విజయంపై సంబరాలు

కడప స్పోర్ట్స్‌ : 18వ ప్రపంచ చదరంగం చాంపియన్‌గా అవతరించిన దొమ్మరాజు గుకేష్‌ విజయం పట్ల జిల్లా చదరంగం క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం కడప నగరంలో జిల్లా చెస్‌ అసోసియేషన్‌ కార్యదర్శి డి.అనీస్‌ దర్బారీ ఆధ్వర్యంలో చదరంగం క్రీడాకారులు కేక్‌ కట్‌ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనీస్‌దర్బారీ మాట్లాడుతూ అత్యంత పిన్నవయసులోనే ఎంతో గొప్ప రికార్డు సాధించి భారతీయ చదరంగం సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేసిన క్రీడాకారుడు గుకేష్‌ అన్నారు. గుకేష్‌ విజయం యావత్‌ భారతదేశానికి గర్వకారణమన్నారు. ఆయన విజయం వర్తమాన, భవిష్యత్‌ క్రీడాకారులకు ప్రేరణ కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

కడపతో అనుబంధం : ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన గుకేష్‌కు కడప నగరంతో అనుబంధం ఉండటం విశేషం. 2016లో కడప నగరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌ అండర్‌–15 చెస్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో గుకేష్‌ కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాడు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 10 ఏళ్ల వయసులో కడపకు విచ్చేయడంతో పాటు పోటీల్లో చక్కగా రాణించి నేషనల్స్‌కు ఎంపికైనట్లు జిల్లా చెస్‌ అసోసియేషన్‌ కార్యదర్శి అనీస్‌దర్బారీ తెలిపారు.

15న కళాశాలల యాజమాన్యాల సమావేశం

వైవీయూ : మైదుకూరు పట్టణంలోని ఆర్‌.ఇ.ఎస్‌ జూనియర్‌ కళాశాల (మేధా డిఫెన్స్‌ అకాడమీ)లో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ప్రైవేట్‌ అన్‌ ఎయిడెడ్‌ జూనియర్‌ కళాశాలల యాజమాన్యాల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.నరసింహులు తెలిపారు. జిల్లా కమిటీ కాలపరిమితి ముగిసినందున సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జూనియర్‌ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్‌ దాడులు

- రైతుల్లాగా వెళ్లి కొనుగోలు
- అధిక ధరకు అమ్మడంతో పట్టివేత



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖాజీపేట : విజిలెన్స్‌ అధికారులు వినూత్న రీతిలో దాడులు నిర్వహించారు. రైతుల వేషధారణతో ఎరువులు, పురుగుల నివారణ మందుల దుకాణాలకు వెళ్లి.. దుకాణదారుల భరతం పట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేటలో కొంత కాలంగా ఎరువులు, పురుగు నివారణ మందులు అధిక ధరకు, నాసిరకమైన వాటిని అమ్ముతున్నారని రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో అన్నదాతలు విజిలెన్స్‌ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు సాధారణ రైతుల వలే.. ఫిర్యాదులు వచ్చిన దుకాణాల వద్దకు వెళ్లారు. యూరియా, పాస్పెట్‌ బస్తాలను కొనుగోలు చేశారు. యూరియా ధర రూ.266.50 ఉండగా 350కు, పాస్పెట్‌ 20:20 రూ.1200 ఉండగా 1300కు దుకాణదారులు విక్రయించారు. డబ్బు నగదు రూపంలో కాకుండా ఫోన్‌పే ద్వారా చెల్లించారు. దీంతో దుకాణదారులు విజిలెన్స్‌ అధికారులకు అడ్డంగా దొరికి పోయారు.

జరిమానా

అధిక ధరకు అమ్మినందుకు, బస్తాల్లో తేడా ఉన్నందుకు లక్ష్మి గణేష్‌ దుకాణం యజమానికి రూ.60 వేలు, వేంకటేశ్వర రైతు డిపోదారులకు రూ.40 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అధిక ధరకు అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని విజిలెన్స్‌ అధికారి బాలగంగిరెడ్డి తెలిపారు. రైతులు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

దుకాణాలు బంద్‌

దాడుల సమాచారం తెలియడంతో మిగిలిన దుకాణాలను మూసివేశారు. అధికారులు తనిఖీలు ముగించుకుని వెళ్లిపోయిన తరువాత దుకాణాలు తెరుచుకోవడం గమనార్హం.

వైఎస్‌ఆర్‌, అన్నమయ్య జిల్లాల్లో..

కడప అర్బన్‌ : విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్‌ఆర్‌, అన్నమయ్య జిల్లాల్లో దాడులు నిర్వహించారు. కడప విజిలెన్స్‌, లీగల్‌ మెట్రాలజీ అధికారులు, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి వైఎస్సార్‌ జిల్లా ఖాజీపేట మండల కేంద్రం, అన్నమయ్య జిల్లా పీలేరు మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్‌ అధికారులు జవహర్‌రెడ్డి, బాల గంగాధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి విజయ్‌కిశోర్‌, ఏఈఈ అశోక్‌కుమార్‌, ఏఈఈ ఖాజాహుసేన్‌, డీసీటీఓలు బాబు మోజెస్‌, రమేష్‌రెడ్డి, లీగల్‌ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు, నాగార్జున, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం



హోంగార్డ్స్‌ పరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న హోంగార్డ్స్‌ కమాండెంట్‌ మహేష్‌కుమార్‌

కడప అర్బన్‌ : హోంగార్డుల సేవలు అభినందనీయమని హోంగార్డ్స్‌ కమాండెంట్‌ ఎం. మహేష్‌కుమార్‌ తెలియజేశారు. కడపలోని ఏఆర్‌ పోలీస్‌ పరేడ్‌ మైదానంలో ఆయన శుక్రవారం హోంగార్డ్స్‌ పరేడ్‌ను పరిశీలించి, దర్బార్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. ఇన్సూరెన్స్‌ (బీమా) చేసుకోవాలన్నారు. ఏడాదికి ఒకసారి మెడికల్‌ చెకప్‌ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్‌ హోంగార్డ్స్‌ డీఎస్పీ కేఎస్‌వీ ప్రసాద్‌, ఆర్‌ఐ శ్రీశైలంరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌ అరెస్టు రాజకీయ కుట్ర

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : రాజకీయ కుట్రలో భాగంగానే హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. ప్రొద్దుటూరులో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పుష్ప–2 విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో సోదరి రేవతి మరణించడం బాధాకర విషయమన్నారు. దీనిని హత్యగా అభివర్ణించి అందుకు అల్లు అర్జున్‌ను బాధ్యున్ని చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. ప్రత్యక్షంగా ఇది పోలీసులే చేసినా పరోక్షంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ చేయించారన్నారు. వారి హస్తం లేకపోతే, ఇందులో రాజకీయ కోణం దాగి ఉండకపోతే, తెలంగాణ ప్రభుత్వం ఇంతటి సాహసం చేయదన్నారు.

ఎన్నికల ప్రచారానికి రావడమే తప్పా

సినీ హీరో అల్లు అర్జున్‌ గడిచిన ఎన్నికల సందర్భంగా నంద్యాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్ప రవి చంద్రకిశోర్‌రెడ్డికి మద్దతు తెలపడమే కారణమని రాచమల్లు తెలిపారు. తమ పార్టీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాడని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎక్కడలేని ఆక్రోశం చెందారన్నారు. ఆనాటి నుంచి అల్లు అర్జున్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం హైకోర్టు మధ్యంతర బెయిల్‌ లభించడం అల్లు అర్జున్‌కు కాస్త ఊరట లభించిందని, ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేశారన్నారు.

చంద్రబాబు సభల్లో మరణాలకు బాధ్యుడెవరు?

ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు నాయుడు 2015 జూలై 14న గోదావరి పుష్కరాల సందర్భంగా సినిమా షూటింగ్‌ తరహాలో చేయడం వల్ల జరిగిన తొక్కిసలాటలో 35 మంది చనిపోయారన్నారు. ఈ సంఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. అలాగే గత ఎన్నికల సందర్భంగా కందుకూరు సభలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. జనాన్ని చూపించేందుకు చంద్రబాబు ఇరుకు సందులో మీటింగ్‌ ఏర్పాటు చేసి వారి మరణాలకు కారణమయ్యారన్నారు. ఈ మరణాలకు బాధ్యుడు చంద్రబాబు కాదా అని రాచమల్లు ప్రశ్నించారు.

నాణ్యమైన, నిరంతర విద్యుత్తే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్‌ ఠాకూర్‌రామ్‌ సింగ్‌

కడప కార్పొరేషన్‌ : వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఏపీ విద్యుత్‌ నియంత్రణ మండలి చైర్మన్‌ ఠాకూర్‌ రామ్‌సింగ్‌ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్‌ భవన్‌లోని సమావేశ మందిరంలో ఏపీఎస్పీడీసీఎల్‌లోని కడప, అన్నమయ్య జిల్లాల అధికారులు, ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థల సేకరణలు పూర్తి చేసి కొత్త సబ్‌ స్టేషన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్‌ అందించుటకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజలకు అందించే విద్యుత్తు సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు తిరిగి వారికి పరిహారం చెల్లించే విధంగా ప్రమాణాలు తీసుకురావడం జరిగిందన్నారు. వీటిని పటిష్టంగా ఆచరణలో పెట్టి విద్యుత్‌ సేవల్లో జాప్యం లేకుండా సంతృప్తికర స్థాయిలో అందించాలన్నారు. విద్యుత్‌ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే ప్రతి ఉద్యోగి సంస్థకు వినియోగదారులకు మధ్య వారధిగా ఉంటారని, కావున జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. విద్యుత్‌ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, ప్రమాదాల నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. డిస్కం, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు ఎప్పటికప్పుడు సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసుకుని అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ వరకుమార్‌, ఏపీ ట్రాన్స్‌ కో చీఫ్‌ ఇంజినీర్‌ కృష్ణమనాయుడు, ఓఎస్‌డీ మునిశంకరయ్య, ఎస్‌ఈ రమణ, ఏఓ మధు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు. అంతకుముందు ఏపీఈఆర్‌సీ చైర్మన్‌ పాత కడప సబ్‌స్టేషన్‌ను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వృద్ధులపై యువకుడి దాడి

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- మద్యం మత్తులో వీరంగం

గుర్రంకొండ : పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న వృద్ధులపై.. ఒక్కసారిగా ఓ యువకుడు దాడి చేయడంతో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అతను మద్యం మత్తులో గ్రామంలో వీరంగం సృష్టించాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని మర్రిమాకులపల్లె కస్బాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం.జయరామిరెడ్డి, ఆయన కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డి చాలా ఏళ్ల క్రితం గ్రామం వదిలి బతుకుదెరువు కోసం వెళ్లారు. ఏడు నెలల కిందట వారు గ్రామంలోకి వచ్చి సొంత ఇంట్లో నివాసముంటున్నారు. ఆరునెలల కిందట జయరామిరెడ్డి మృతి చెందాడు. అప్పటి నుంచి దిలీప్‌కుమార్‌రెడ్డి ఒంటరిగా ఉంటున్నాడు. ఇతని తల్లి చిన్నతనంలో మృతి చెందింది. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గ్రామంలో రచ్చబండ వద్ద పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్న వృద్ధురాళ్లపై అతను ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. కట్టెలతో ఇష్టానుసారంగా చితకబాదాడు. ఓ ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న ఇద్దరు వృద్ధురాళ్లను కొట్టాడు. ఈ సంఘటనలో కె.రామలక్ష్మమ్మ(75), కె.లక్ష్మమ్మ(80), హైమావతమ్మ(60), ఈశ్వరమ్మ(55), ఎస్‌.లక్ష్మమ్మ(65), కత్తి లక్ష్మమ్మ(60)కు గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి కాళ్లు విరిగిపోయాయి. బాధితులను గ్రామస్తులు 108 వాహనం ద్వారా వాల్మీకిపురం, మదనపల్లె ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. దిలీప్‌కుమార్‌రెడ్డి కట్టెలు చేతపట్టుకొని గ్రామంలో వీరంగం సృష్టించడంతో.. గ్రామస్తులు భయాందోళనతో పరుగులు తీశారు. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ మధురామచంద్రుడు సిబ్బందితో వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా దిలీప్‌కుమార్‌రెడ్డి గ్రామంలో పలువురు చిన్నారులను కిడ్నాప్‌ చేయడానికి యత్నించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మీ పిల్లల్ని కిడ్నాప్‌ చేస్తున్నామని పలువురు చిన్నారుల తల్లిదండ్రులకు ఫోన్‌ చేసి బెదిరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



ఐజీ కార్ల్‌లో రైతు పొలం పరిశీలిస్తున్న ఇటలీ రీసెర్చర్‌ అన్న డి

పులివెందుల రూరల్‌ : పులివెందులలోని ఐజీ కార్ల్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను ఇటలీ దేశ రీసెర్చర్‌ అన్న డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ శివారెడ్డి మాట్లాడుతూ ఇటలీ రీసెర్చర్‌ అన్న డి అనే మహిళ ఈ నెల 19 వరకు పులివెందులలో ఉండి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలు, మోడల్స్‌ను పరిశోధన చేయడానికి ఐజీ కార్ల్‌కు వచ్చారన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ ప్రవీణ్‌ మాట్లాడుతూ పులివెందుల డివిజన్‌లో ఎక్కువ రైతులు సాగు చేసే పంటలలో ప్రధానంగా అరటి, శనగలో ఏ గ్రేడ్‌ మోడల్‌ విధానాలు చేయించడం జరిగిందన్నారు. అదే విధంగా ఏటీఎం మోడల్స్‌, పీఎండీఎస్‌ విధానాలు చూడవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ సందీప్‌, ప్రాజెక్ట్‌ ఎగ్జిక్యూటివ్‌ సోహెల్‌, మాస్టర్‌ ట్రైనర్‌ భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌, ఎన్‌ఎఫ్‌ఏలు, నరసింహారెడ్డి, భాస్కర్‌, సుజాత పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ములకలచెరువు : అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన బయ్యారెడ్డి(42) టమాటతోపాటు వివిధ పంటల కోసం రూ.16 లక్షల వరకు అప్పు చేశాడు. సరిగా దిగుబడి రాకపోవడంతో నష్టం పోయాడు. అప్పులు ఇచ్చిన వారు వేధిస్తుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బయ్యారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.